


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

మంగళవారం | 06 మే 2025

పేజీలు 8


● బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రులు బిసి,ఫరూక్‌లు



దేవుళ్ళ చిత్రపటాలకు హారతి ఇస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని కేసీ కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనంలో అత్యాధునిక వసతులతో ఇండియన్

మిగతా 2లో

## అత్యాధునిక వసతులతో

# రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్



రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ భవన శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రులు, జిల్లా కలెక్టర్

# ఓర్వకల్లులో ఎంఎస్ఎంఇ పార్కు

- 219 ఎకరాల్లో రూ.38.5 కోట్లతో పార్కు నిర్మాణం
- 69 ప్లాట్స్ ఏర్పాటు
- త్వరలో విమానాశ్రయంలో పైలట్ శిక్షణా కేంద్రం
- ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

**కర్నూలు/ ఓర్వకల్లు, మేజర్ న్యూస్‌బ్యూరో :** కర్నూలు జిల్లా పరిధిలోని ఓర్వకల్లు మండలం గుట్టపాడు వద్ద 219 ఎకరాల్లో 38.5 కోట్ల రూపాయలతో 69 ప్లాట్లతో ఎంఎస్ఎంఇ (చిన్న తరహా పరిశ్రమల కేంద్రం) పార్కు ఏర్పాటయ్యింది. దీంతో ఇక్కడ పెద్ద ఎత్తున పరిశ్రమలు రాబోతున్నాయి. ఇప్పటికే ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తోంది. ఓర్వకల్లు విమానాశ్రయంలో పైలట్ శిక్షణా కేంద్రం కూడా త్వరలో ప్రారంభం కాబోతోంది.

మిగతా 2లో



ఎంఎస్ఎంఇ పార్కు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ




సూర్య



# ఓర్వకల్లులో ఎంఎస్ఎంఇ పార్కు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పెద్ద పరిశ్రమలు వచ్చాయి. త్వరలోనే అవి ఉత్పత్తిని ప్రారంభించబోతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇండస్ట్రియల్ హబ్‌లో పనులు వేగం పుంజుకున్నాయి. కర్నూలు జిల్లాకు చెందిన టి.జి.భరత్ రాష్ట్ర పరిశ్రమల మంత్రిగా ఉన్న నేపథ్యంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు ప్రాధాన్యత పెరిగింది. దీన్ని అభివృద్ధి చేసేందుకు, పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఆయన ప్రతిష్టాత్మకంగా వ్యవహరిస్తుండడంతో రానున్న మూడేళ్లలో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని భావిస్తున్నారు. 250 ఎకరాల్లో డ్రోన్ ఇండస్ట్రీ ఇక్కడ ఏర్పాటు కాబోతుండగా, ఇప్పుడు 209 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటైంది. భవిష్యత్తులో ఓర్వకల్లు పరిశ్రమల కేంద్రం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఓర్వకల్లు ఎంఎస్ఎంఇ పార్కును సోమవారం రాష్ట్ర పరిశ్రమల మంత్రి టి.జి.భరత్ దీన్ని ప్రార ంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేయాలన్న గొప్ప ఆలోచన మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే వచ్చిందని, దేశంలోని ఏ ముఖ్యమంత్రికీ ఇలాంటి ఆలోచన రాలేదని ఆయన చెప్పారు. చంద్రబాబు ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో విజన్ 2020 గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడిన సమయంలో కొందరు అపహాస్యం చేశారని, ఆ విజన్ ఇప్పుడు హైదరాబాద్‌ను చాలా అభివృద్ధి చేసిందని ఆయన గుర్తు చేశారు. విజన్ ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు కూడా అలాంటిదేనని ఆయన చెప్పారు. ఒకప్పుడు 60శాతం మార్కులు వస్తేనే ఎక్కువనుకునేవారని, ఇప్పుడు 99 శాతం నుండి 100 శాతం మార్కులు కూడా సాధిస్తున్నారని, ఆ దిశగా చదువుకున్న



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి టిజి.భరత్

వారందరికీ స్థానికంగానే ఉద్యోగాలు ఇచ్చేందుకు అన్ని చోట్లా ఎంఎస్ఎంఇ పార్కులు ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. సరైన శిక్షణ, చదువు ఉంటేనే ఉద్యోగావకాశాలుంటాయని ఆయన అన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌తో స్థానిక యువతకు ఉద్యోగాలు వ స్తాయని ఆయన చెప్పారు. ఓర్వకల్లు ఎంఎస్ఎంఇ పార్కుకు నీటి వసతి కల్పించే పనులు కూడా 90శాతం పూర్తయ్యాయని ఆయన చెప్పారు. ఓర్వకల్లు ఎంఎస్ఎంఇ పార్కు కోసం దూపాడు-బేతంచర్ల మధ్య రైల్వే స్లైడింగ్ నిర్మాణానికి అనుమతులు వస్తున్నాయని, అనంతపురం-కర్నూలు ఇంద్రస్టియల్ జోన్ చేస్తున్నామని మంత్రి భరత్ చెప్పారు.

**పైలట్ శిక్షణా కేంద్రం :** ఓర్వకల్లు విమానాశ్రయంలో పైలట్ శిక్షణా కేంద్రం త్వరలో ప్రారంభం కాబోతోందని మంత్రి టి.జి.భరత్ చెప్పారు. ఈ శిక్షణకు కొద్దిగా ఖర్చు ఎక్కువే అయినా శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగాలవకాశాలుంటాయని ఆయన తెలిపారు. మంచి సంపాదన ఉంటుందని, పైలట్ శిక్షణ తీసుకోవాలని ఆయన సూచించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వెనక్కు పోయిన టిసిఎస్, ఆర్సిలర్ మిట్టల్ కంపెనీలు, 14వేల కోట్ల రూపాయల విలువైన సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి లోకేష్ చొరవతో రాబోతున్నాయని ఆయన చెప్పారు.

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారు, స్టార్టప్‌లు నిర్వహిస్తున్న వారికి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఓర్వకల్లు పార్కు ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా కర్నూలు జిల్లాలో 7 నియోజకవర్గాలుండగా, పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఓర్వకల్లులో పార్కు ప్రారంభించుకున్నామన్నారు. ఓర్వకల్లులో 15వేల ఎకరాల్లో 2వేల కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేయబోతోందని ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఓర్వకల్లు మండలాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకుంటున్న చొరవను వివరించారు. విమానాశ్రయం, డిఆర్‌డిఓ, జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్, సోలార్ పార్కులు ఇప్పటికే ఏర్పాటయ్యాయని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు ఆర్‌డిఓ సందీప్‌కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం అరుణకుమారి, వివిద కార్పొరేషన్ డైరక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితా

# నిరుపేదల ఇళ్ళ పట్టాలపై మంత్రి బీసీ సమీక్ష



ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఇళ్ళ పట్టాలపై కలెక్టర్‌తో సమీక్షిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** బనగానపల్లె పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు ప్రతి ఒక్కరికి 2సెంట్ల ఇళ్ళ పట్టాలు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిరుపేదల ఇళ్ళ పట్టాల అంశంపై జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో డోన్ ఆర్డీవో నరసింహులు, నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, బనగానపల్లె మండల తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లెలో దాదాపు 3,500 నుంచి 4వేల మంది నిరుపేదలకు 2సెంట్ల ఇళ్ళ స్థలాలు ఇస్తామని గతంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు వీలుగా ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తరెవెన్యూ అధికారుల పరిశీలనలో భాగంగా బనగానపల్లె పట్టణంలోని భానుముక్కల గ్రామం పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని మంత్రి ఆదేశించారు. 2సెంట్ల చొప్పున ప్రభుత్వ స్థలం ఇవ్వడానికి దాదాపు 116 నుంచి 140 ఎకరాల ప్రభుత్వ అవసరం అవుతోందని అధికారులు తెలిపారు. బనగానపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బనగాన పల్లెలో కార్పెంటర్లకు శాశ్వత నివాసాలు ఏర్పాటుకు కార్పెంటర్ కాలనీ ఏర్పాటుపై కూడా సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# దేవాదాయ మాన్యపు భూములను పరిరక్షించండి

-పిజిఆర్ఎస్ కు మారం దొడ్డి గ్రామస్థుల దరఖాస్తు



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** దేవాదాయ మాన్యపు భూములను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించి హద్దులు ఏర్పాటు చేయాలనీ సోమవారం ఇంచార్జి తహశీల్దార్ కు మారం దొడ్డి గ్రామస్థులు దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో సోమవారం ప్రభుత్వ అధికారులు నిర్వహించిన పిజిఆర్ఎస్ రెండు దరఖాస్తులు వచ్చాయని అందులో ఒక్కటి బ్రహ్మణదొడ్డి మజారా గ్రామం మారందొడ్డి గ్రామంలోని దేవాదాయ మాన్యపు భూములు అక్రమార్కుల చేతిలో అన్యాక్రాతం అవుతుండడంతో ప్రస్తుతం గ్రామంలో జారుగుతున్న రీ సర్వే లో దేవాదాయ మాన్యపు భూములను గుర్తించి వీటికి హద్దులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని మారందొడ్డి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు దరఖాస్తూ చేసుకున్నారు. రెవిన్యూ సంబందించిన మరొక్క దరఖాస్తూ కాగా దరఖాస్తులను నాణ్యతతో పరిశీలించి పరిష్కరిస్తామని ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు, మండల వ్యవసాయధికారి జి. మల్లేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక వసతులతో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజి సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా,జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో ఎంతో మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు చికిత్స కోసం రావడం జరుగుతుందని, రక్తం దొరకక ఏ ఒక్కరు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఇండియన్ రెడక్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ రాజకుమారి నేతృత్వంలో బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను ఏర్పాటు చేసి సమాజానికి అందుబాటులోకి తీసుకుని రావడం చాలా సంతోషకరమన్నారు. రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేసి మరొక ప్రాణం కాపాడేందుకు తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా విభజన



రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ గదులను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ , ఎన్ఎండి ఫరూక్‌లు

తరువాత నంద్యాలలో బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏదైనా అపాయకర పరిస్థితిలో రోడులకు బ్లడ్ కావాలంటే కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఇక్కడి నుంచే సరఫరా చేయవచ్చున్నారు. స్థానికంగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ద్వారా నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కలెక్టర్ చొరవతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సకల సదుపాయాలతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. గతంలో బనగానపల్లెలో బ్లడ్ బ్యాంక్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరితే రెడ్‌క్రాస్ సంస్థ సానుకూలంగా స్పందించిందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో రక్తం అవసరం ఉన్న వారికి సరైన సమయంలో అందించడానికి ఇతర జిల్లాలోని రక్తనిల్వ కేంద్రాల మీద ఆధారపడకుండా మన జిల్లాలోనే రక్తనిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక సబ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నా ప్రజలు రక్తనిల్వ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ సైన్యాన్ని ఒకటి తయారు చేసి యూత్ రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్‌గా ఏర్పడి జిల్లాకు ఏ విపత్తు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా కూడా సమాయత్తం చేస్తున్నామన్నారు. అదే విధంగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జిల్లా మంత్రులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్వో



అత్యాధునిక పరికరాలు పరిశీలిస్తున్న మంత్రి బీసీ, కలెక్టర్‌లు

రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, డీఈఓ జనార్దన్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, డీసీహెచ్ డాక్టర్ జఫ్రుల్లా, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఖలందర్, రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్ మారుతికుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ మమతారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఉస్మాన్‌బాషా, నాగశేషయ్య, మద్దిలేటి, నాగరాజు, చైతన్య, యాకూబ్, సురేంద్ర, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



# ఆశావర్కర్లకు ఈశ్రమ్ కార్డులపై అవగాహన

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా జడ్జి జి కబర్ధి ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరి నాథ్‌లు సోమవారం న్యాయ సేవాసదన్ నందు ఆశావర్కర్లకు ఈశ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతిఒక్కరికి ఈ శ్రమ్ కార్డులు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈశ్రమ్ కార్డుల వల్ల లభించే ఉపయోగాలను మీకు తెలిసిన కార్మికులకు



అవగాహన కల్పిస్తున్న లీలా వెంకట శేషాద్రి

తెలియజేసి వారు ఈశ్రమ్ కార్డులు పొందేలా కృషి చేయాలన్నారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ శాంతికళ మాట్లాడుతూ తమ డిపార్ట్‌మెంట్‌లోని ఆశావర్కర్లందరు ఈ శ్రమ్ కార్డులు పొందారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆశావర్కర్స్‌కు ఈ శ్రమ్ కార్డులు ఈశ్రమ్ పోర్టర్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ కార్డులు పొందిన వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే పిఎం సురక్ష భీమా యోజన కింద రూ. 2లక్షలు ప్రమాద మరణ భీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ లీగల్ ఆఫీసర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థాన ట్రస్టు కమిటి డైరెక్టర్ రేసులో ఎన్‌సి.శివప్రకాష్

- టీడీపీ అవిర్భావం నుండి తండ్రితో పాటు తనయుడు కృషి
- ఆయనకు పదవిని కల్పించాలని పార్టీ మండల నాయకులు, వీరశైవ సంఘం నాయకులు, అభిమానులు ప్రభుత్వానికి విన్నపం



ఎన్.సి శివప్రకాష్

**హొళగుంద,మేజర్‌న్యూస్:**శ్రీశైలం మల్లికార్జు న,భ్రమరాంబ దేవి దేవస్థాన ట్రస్టు కమిటి డైరెక్టర్ రేసులో ఎన్‌సి శివప్రకాష్ ఉన్నారు .హొళగుందకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దివంగత నేత ఎన్.సి బసలింగప్ప తనయుడు పార్టీ యువ నేత ఆదోని మార్కెట్ యార్డు వ్యాపార వేత్త ఎన్.సి శివప్రకాష్ అందరికి సుపరిచితుడు.తెలుగుదేశం పార్టీ అవిర్భావం చేసినప్పటి నుండి తండ్రి బసలింగప్పతో పాటు శివప్రకాష్ ఇప్పటి వరకు ఒకే పార్టీలోనే ఉంటు కార్యకర్తలకు అండదండలుగా నిలిచి పార్టీ బలోపేతానికి తనవంతుగా ఎంతో కృషి చేస్తున్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల తరపున మండలంలోని వాడవాడల విస్తృతంగా ప్రచారం చేశారు.అలాంటి నాయకుడికి పార్టీలో ఇంత వరకు ఎలాంటి నామినేటెడ్ పదవిని ఆధీష్టానం కల్పించలేదు.సర్గీయ నందమూరి తారకరామరావు, నటసింహం నందమూరి బాలక్రిష్ణ వీర అభిమాని కావడం పార్టీలో మంచి గుర్తింపు కలిగిన యువ నేత..శివ భక్తుడు అయిన ఎన్.సి శివప్రకాష్ కు శ్రీశైలం దేవస్థాన కమిటి డైరెక్టర్ పదవిని కల్పించాలని టీడీపీ మండల నాయకులు,కార్యకర్తలు,వీరశైవ సంఘం నాయకులు,ఆయన అభిమానులు పార్టీ ఆధీష్టానాన్ని, కూటమి ప్రభుత్వాన్ని విన్నమిస్తున్నారు.శివుని పేరును పెట్టుకున్నా శివప్రకాష్ నిత్యాం శివుడిని కోలుస్తు పూజించే వ్యక్తికి సరైన పదవి శ్రీశైలం దేవస్థానం ట్రస్టు కమిటి డైరెక్టర్ పదవి అని నాయకులు చెప్పుకోస్తున్నారు. కావునా ఈ సారీ కల్పించే నామినేటెడ్ పదవిలో శివప్రకాష్‌కు డైరెక్టర్ పదవిని కచ్చితంగా కల్పించాలని అందుకు పార్టీ తాలూకా ఇన్‌చార్జీ వీరభద్రగౌడ్ కూడా పూర్తీ స్థాయిగా సహకరించాలని మండల నాయకులు కోరుతున్నారు.

# తప్పిపోయిన కొడుకును తల్లికి అప్పగింత

**– బాలుడు మిస్సింగ్ కేసు నమోదు**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** 12 సంవత్సరాల క్రితం తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు చేరిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. మంత్రాలయం ఎస్.ఐ శివాంజులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2012 జనవరి 22న ఆరు నెలల బాలుడు వినోద్ కుమార్ ఆలియాస్ శరత్ తప్పిపోయినాడు. అప్పట్లో 5/2012 మంత్రాలయం పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైందని తెలిపారు. వినోద్ కుమార్ మంత్రాలయంలో రాఘవేంద్ర నగర్‌కు చెందిన వాడు. మంత్రాలయంలో ఆరు సంవత్సరాల బాలుడుగా ఉన్నప్పుడు తప్పిపోయి ఏడుస్తూ ఉండగా, గుర్తు తెలియని దంపతులు చేరదీసి హైద్రాబాదులోని ఆగాపే అనాధ ఆశ్రమంలో చేర్పించారు. అక్కడ అడ్రస్ మాత్రం మంత్రాలయం అని వ్రాయించారు. అక్కడే విద్యనభ్యసించారు. గత ఐదు సంవత్సరాల క్రితం అక్కడి నుంచి డోన్‌కు చేరుకొని రమేష్ అనే అతనుదగ్గర బైకు మెకానిక్‌గా పనిచేశాడు. చదువుకోవాలన్న ఆశతో ఓపెన్ టెన్త్ పరీక్ష రాసి పాస్ అయ్యాడు. డోన్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. అక్కడక్కడ తిరిగి మంత్రాలయం అని తెలుసుకొని మంత్రాలయంకు చేరుకున్నారు. తల్లిని గుర్తించి తల్లిచెంతకు చేరాడు. అనంతరం తల్లి కొడుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు విచారణ చేయగా, ఆమె కుమారుడే అని విచారణలో తేలగా, కొడుకును ఆ తల్లికి అప్పగించడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్.ఐ

# చెట్లను నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి...



**పత్తికొండ, మేజర్ న్యూస్ :** పత్తికొండ నుండి హోసూరు వరకు ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నాశనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా కార్యదర్శి బ్రహ్మయ్య కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా గతంలో వాతావరణ సమతుల్యతకోసం నీడనిచ్చే, వర్షాభావాన్ని తగ్గించే చెట్లను నాటడమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరు– చెట్టు పథకంలో రూ.లక్షలు ప్రజాధనంతో చెట్లను నాటడమైందన్నారు. అనాగరిక చర్యల ద్వారా ఈ చెట్లను ఉద్దేశ్య పూర్వకంగా రాత్రిపూట కొంతమంది పెట్రోలు పోసి నిప్పంటించి తగులపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చెట్లు వాన గాలుల సమయంలో నేలకొరిగి రోడ్డుకు అడ్డంకిగా మారుతున్నాయి. ఇది వాతావరణానికి హనికరమే కాకుండా, రోడ్డుపై ప్రయాణించే ప్రయాణీకులకు ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత ఫారెస్టు శాఖ అధికారులు మరియు ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలందరూ పర్యావరణ పరీరక్షణలో భాగస్వాములై ఉండాలని కోరారు.

# ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యపై అవగాహన కల్పించాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :**విద్యా హక్కు చట్టానికి అనుగుణంగా పేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు కల్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనలకు అనుగుణంగా సీట్లు కేటాయిం చాలని సూచించారు. ఈ మేరకు సోమవారం డిఈఓ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఉచిత విద్యకు దరఖాస్తులు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని మండల విద్యా శాఖ అధికారులు విద్యా హక్కు చట్టం నిర్ధేశించిన విధంగా ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025–26విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఈ నెల 2న ప్రారంభమ య్యాయని తెలిపారు. ఈ ప్రక్రియ మే 19వరకు కొనసాగుతుందన్నారు. సచివాలయా లు ఎంఈఓ కార్యాలయాలు రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఫోటోలు షేర్ చేయాలన్నారు. ఆర్‌టిఈ–12(1)సి అడ్మిషన్ల విషయంలో మరింత విస్తృత ప్రచారం కల్పించి వీలైనంత ఎక్కువ మందితో రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు డిఈఓ కార్యాలయంతో సంప్రదింపులు చేయాలన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

**– నగరపాలక కమీషనర్ రవీంద్రబాబు**

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయలలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 8అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను అడిగి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌ఓ జునైద్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, టిపిఆర్‌ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులు తీసుకుంటున్న కమీషనర్

# ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులు

**– కమీషనర్ రవీంద్రబాబు**

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరవ్యాప్తంగా ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులు సోమవారం ప్రారంభించినట్లు నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రూ. 1.06కోట్లతో 150కిపైగా ప్రత్యేక సిబ్బందితో 52వార్డుల్లో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికే పాతబస్తీలో పూడికతీత పనులు పూర్తి అయ్యాయని త్వరితగతిన పూడికతీత పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమీషనర్ వెల్లడించారు.

# రూ.లక్ష 25 వేల కోట్ల వ్యాపారంతో దేశంలోనే ఉత్తమ గ్రామీణ బ్యాంక్‌గా ఏపీజీబీ



**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** గత ఆర్థిక సంవత్సరంలో లక్ష 25 వేల కోట్ల వ్యాపారంతో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ దేశంలోనే ఉత్తమ గ్రామీణ బ్యాంక్‌గా అవార్డు పొందిందని బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటరమణ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా ఉయాలవాడ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శాఖను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ 4 గ్రామీణ బ్యాంక్‌లు విలీనం జరిగి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా రూపాంతరం చెందిందని అన్నారు. కాబట్టి బ్యాంక్ సిబ్బంది ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలని, వ్యాపారాన్ని మరింతగా పెంచాలని సూచించారు. వడ్డీ రేట్లకు కూడా మార్పులు వస్తాయని అన్నారు. బంగారంపై రుణం గ్రాముకు రూ. 6 వేల వరకు ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. ఖాతాదారులకు మంచి సేవలు అందించడం ద్వారానే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మంచి సేవలు అందించి వ్యాపారాన్ని పెంచాలని సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ సంపత్, అసిస్టెంట్ మేనేజర్ కామాక్షి, క్యాషియర్ అనీల్, తదితరులు పాల్గొన్నారు.

# చేపల చెరువులను పరిశీలించిన అధికారులు



**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామ సమీపంలో నిర్మించిన చేపల చెరువులను అధికారులు సోమవారం పరిశీలించారు. చేపల చెరువుల నుండి కొన్నిరోజులుగా నిల్వ ఉన్న చేపల చెరువుల నీళ్ళను నదిలోకి వదులుతున్నట్లు అక్కడి గ్రామస్తులు ఫిర్యాదుచేయడంతో, అలాగే పత్రికల్లో రావడంతో ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుయస్ ఏఈ తిమ్మరాజు, వీఆర్‌ఓ బాలస్వామి, పంచాయితీ కార్యదర్శి చేపల చెరువు అధికారులు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు చేపల చెరువులును ఆదేశాల మేరకు పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే చేపలచెరువు నీరు నదిలోకి వదిలేసిన నీటిని సేకరించి టెస్ట్‌కు పంపిస్తున్నట్లు వారు తెలిపారు. టెస్టుల నివేదికల వస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

# నాటుసారా స్థావరాలపై దాడులు



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 45లీటర్ల నాటుసారా, 16లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గుడుంబాయి తాండలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మాదవత్ దన్ను నాయక్, నానవత్ రాజు నాయక్, మాధవత్ మద్దిలేటి నాయక్ పొట్ల నాయక్, నానా వత్ రమేష్ నాయక్‌ల వద్ద నుండి నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు మరికొంతమందిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా అమ్మినా, తయారు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సూర్య www.suryaa.com



# శేష వాహనంపై విహరించిన శ్రీ జ్వాలా నరసింహస్వామి





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ మాస నరసింహ జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉత్సవమూర్తులైన శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లను శేషవాహనంలో ఆశీనులను చేసి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్తమ మూర్తులైన శ్రీ జ్వాల నరసింహ స్వామి అమృతవల్లి అమ్మవార్లకు నవకలశ తిరుమంజనం నిర్వహించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంలో శ్రీ జ్వాల నరసింహ స్వామి కొలువుతీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

# రెవెన్యూ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించండి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి అత్యధికంగా ఉన్నాయని త్వరగా పరిష్కరించేందుకు ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన వినతుల లో రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు అత్యధికంగా ఉన్నాయని వీటన్నింటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా పెండింగ్‌లో ఉన్న 102మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా, సిటిజన్ ఈకేవైసీ 1.20లక్షలు, 996 మంది వర్క్‌ఫ్రం హోం డేలా, చిల్డ్రన్స్ విథౌట్ ఆధార్ 5,554, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 72వేలు పెండింగ్‌లో ఉన్నాయని వీటన్నింటిని త్వరితగతిన సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఈకార్యక్రమంలో దాదాపు 207మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

# పంట కాల్వను కప్పేసి రోడ్డు నిర్మాణం చేసిన ఆర్అండ్‌బి



మాట్లాడుతున్న రైతు నాగేంద్రప్ప

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ల మండల కేంద్రం నుంచి పేరూరుకు వెళ్లే రహదారిలో ఈ మధ్య కాలంలో కొత్తగా ఆర్ అండ్ బి రోడ్డు మార్గాన్ని నిర్మించారు. కొత్త మార్గం ఏర్పడినందున వాహనదారులు, గ్రామస్తులు ఆనందంగా ఉన్నా ఆ రోడ్డు వెంట ఉన్న పంట పొలాల రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో పంట నీటి కాల్వలు, ఇతర నీటి ప్రవాహం ఉన్న స్థలాలను పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారు కేవలం ఆయనకు అనుకూలమైన చోట మాత్రమే కల్వర్టులను నిర్మించారు. బడా నాయకులకు చెందిన పొలాల వద్ద రోడ్డుకు ఇరువైపులా మట్టి కాల్వల నిర్మాణం చేపట్టి మిగితా చోట్ల మాత్రం పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో సహజంగా ఉన్న నీటి కాల్వలను కప్పేసి రోడ్డు నిర్మాణం చేయడం వల్ల ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. శిరివెళ్ల గ్రామానికి చెందిన నాగేంద్రప్ప అనే రైతు ఇదే విధంగా వర్షాకాలంలో తన పంట పొలం పూర్తిగా నీటమునిగి పంట నష్టపోయి ఆర్ అండ్ బి అధికారులకు ఫిర్యాదు చేయగా వారు మాకేమి సంబంధం లేదని తోసిపుచ్చారు. దీంతో రైతు లోకాయుక్తను ఆశ్రయించగా కోర్టు ఆర్ అండ్ బి అధికారులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుని కోర్టుకు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఆ తర్వాత ఆర్ అండ్ బి అధికారులు కేవలం కంటి తుడుపు చర్యగా రైతు పొలాన్ని సందర్శించి రైతు ప్రమేయం లేకుండానే నష్టం జరగలేదని, అక్కడ పంట కాలువ లేదని తప్పుడు నివేదికను కోర్టుకు సమర్పించారు. దీంతో రెండోసారి లోకాయుక్తకు నాగేంద్ర ఫిర్యాదు చేయగా ఆర్ అండ్ బి ఎస్ఈ, డిఈ, ఏఈ, కాంట్రాక్టర్ ఏప్రిల్ 29వ తేదీన పొలాన్ని పరిశీలించి రైతు నాగేంద్రప్ప తమకున్న పరిధిలో వరకు మాత్రమే రోడ్డు నిర్మాణం చేపట్టామని పంట పొలాల్లో వస్తున్న నీటికి మాకు సంబంధం లేదని వెళ్లిపోయారు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

# శ్వాస మార్గాలు దెబ్బతినడం వల్ల ఆస్తమా

**– కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డా. పొట్టి వెంకట చలమయ్య**



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** శ్వాస మార్గాలు దెబ్బతినడం వల్ల వచ్చే దీర్ఘకాలిక వ్యాధి ఆస్థమా అని కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డా. పొట్టి వెంకట చలమయ్య అన్నారు. ప్రతి ఏడాది మే మొదటి మంగళవారం అంతర్జాతీయ ఆస్థమా దినోత్సవాన్ని గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్థమా నిర్వహిస్తుంది. అందులో భాగంగా సోమవారం కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డా. పొట్టి వెంకట చలమయ్య మాట్లాడుతూ దీనిలో ప్రధానంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, శ్లేష్మం రావడం ఊపిరి ముడుచుకునే శబ్ధం(వీజింగ్) వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి లక్షణాలు రాత్రి, చలికాలంలో ఎక్కువ అవుతా యని అన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ ఆస్థమా దినోత్సవం సందర్భంగా ఇన్హేల్డ్ ట్రీట్మెంట్స్ అందరికి అందుబాటులో ఉండేలా చేయండి థీమ్‌తో ముందుకు వెళ్తున్నారన్నా రు. ఈ థీమ్ ద్వారా ఆస్థమా ఉన్న ప్రతి ఒక్క రికి ప్రాథమిక ఇన్హేల్డ్ మందులను అందు బాటులోకి తీసుకురావడం అవసరమని హైలెట్ చేస్తున్నారన్నారు. ఇది వ్యాధిని నియంత్రించడంలో మరియు తీవ్రమైన ఇబ్బందులను నివారించడంలో సహాయ పడుతుందన్నారు.

# శరీరానికి తగిన వ్యాయామం డ్యాన్స్

**– మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్**



డాన్స్, ఫిట్‌నెస్ స్టూడియోను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** డ్యాన్స్ మరియు ఫిట్‌నెస్‌లలో సాధన చేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రితం డాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియోను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ నగరంలో రితం డాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఇలాంటి సంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడే అవకాశం ఉందని వివరించారు. డ్యాన్స్, ఫిట్‌నెస్‌లలో సాధన చేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామంతో పాటు ఐక్యూ పెరుగుతుందన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ కన్నా, వీరేంద్ర, స్టూడియో నిర్వాహకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# షర్మిలమ్మ పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కర్నూలు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జిలాని బాష,మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 11న షర్మిలమ్మ కార్యకర్తల సమావేశానికి వస్తున్నట్లు తెలిపారు. కావున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు బజారన్న, మహేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కెడిసిసి బ్యాంక్ ఛైర్మెన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపిడిఓ



**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** కర్నూలు డిస్ట్రిక్ కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు ఛైర్మన్‌గా నియమి తులైన కోడుమూరు టిడిపి ఇంచార్జ్ డి విష్ణువర్ధన్‌రెడ్డిని కర్నూలు రూరల్ ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జి రఘునాథ్, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపిడిఓ సి జాకీర్ హుస్సేన్, పరిపాలనాధికారి జీవి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వున్నారు.

# రూ.3 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు

**– ఎమ్మెల్యే చేతులమీదుగా భూమి పూజ**



భూమి పూజల చేస్తున్న ఎమ్మెల్యే శ్యామ్ కుమార్

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్:** మద్దికెర మండలం పెరవలి గ్రామంలో ఆరు గ్రామాలకు కరెంట్ సమస్యను తీర్చే రూ.3కోట్లతో నూతన విద్యుత్ 11/33 కె.వి ఉప కేంద్రానికి ఎమ్మెల్యే కె.ఈ శ్యాం కుమార్, విద్యుత్ జిల్లా అధికారి ఉమాపతి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతులకు రైతు కూలీలకు మంచి చేసే ప్రభుత్వమన్నారు. మద్దికెర మండల పరిధిలోని పెరవలి, ఎడవల్లి, బొమ్మనపల్లి, మదనంతపురం చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన రైతులకు లోఓల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని, నా దృష్టికి తీసుకురావడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఏటువంటి మేలుచేయకపోగా, రైతులకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్మోహన్‌రె డ్డి అన్నారు. వచ్చే ఆగస్టులోపు విద్యుత్ ఉపకేంద్రం పనులు పూర్తి చేసి రైతులకు విద్యుత్ ఉప కేంద్రం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విద్యుత్ అధికారులు, పాల్గొన్నారు.

# సిహెచ్ఓల సమ్మెతో..

# వృద్ధులకు భారమైన వైద్యం




హెల్త్ సెంటర్లకు తాళాలు వేసిన దృశ్యం

**చిన్న చిన్న రోగాలకు జేబులకు చిల్లులు పడుతున్నాయన్న వృద్ధులు**

**డిమాండ్స్ పరిష్కారం కోసం రోడ్డెక్కిన సిహెచ్ఓలు**

**ఆరోగ్య శాఖ మంత్రి వ్యాఖ్యలపై మండిపాటు**

**బండి ఆత్మకూరు రూరల్ ,మేజర్ న్యూస్ :** గ్రామీణ వైద్య సిబ్బంది (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ) తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె గ్రామీణ మహిళలకు, గర్భవతులకు వృద్ధులకు,చిన్న పిల్లలకు సకాలంలో అందవలసిన వైద్య సేవలకు దూరం చేస్తుంది. వీరి సమ్మె ప్రభావం గ్రామీణ ప్రజల ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.సమ్మె ప్రభావంతో గ్రామీణ ప్రాంతాలలో వృద్ధులు మహిళలు వైద్య సేవలు అందక తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు చిన్నచిన్న రోగాలకు గ్రామస్థాయిలోనే వైద్య సేవలు , ఉచితంగా మందులు లభించేవని ప్రస్తుతం దగ్గు జ్వరం ,డయాబెటిక్ రోగులు ,గాయాలకు డ్రెస్సింగ్ లు, ఇతర చిన్న రోగాలకు వైద్య సేవ కోసం తమ జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుండి అందుకున్న పింఛన్ సొమ్ము కాస్త వైద్యం, మందు బిల్లలకే సరిపోతున్నాయని,చిన్న చిన్న వైద్య సేవల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నామని అసహన వ్యక్తం చేస్తున్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న వైద్య సిబ్బంది డిమాండ్లను పరిష్కరించి గ్రామస్థాయిలో వైద్య సేవలను మరింత పటిష్టం చేయాలని వృద్ధులు కోరుతున్నారు. మరోపక్క తమ సమస్యల పరిష్కారం కోసం గత వారం రోజులుగా నిరవధిక సమ్మె పేరుతో రోడ్డెక్కిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత , సరైన సమయానికి ఇన్సెంటివ్స్ అందజేయాలని, వేతనాలను పెంచేలా మరికొన్ని డిమాండ్లతో ప్రభుత్వంపై నిరోధిక సమ్మెతో ఒత్తిడిని తీసుకుని వస్తున్నారు. ఇందుకోసం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లకు దూరంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు.నంద్యాల జిల్లా వ్యాప్తంగా దాదాపు 369 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ద్వారా గ్రామాలలో వృద్ధులకు, మహిళలకు గర్భవతులకు అందుబాటులో వైద్య సేవలు లభిస్తుండేవి.ప్రస్తుతం సిహెచ్ఓ లు రోడ్డు ఎక్కడంతో వైద్య సేవలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏఎన్ఎమ్ లకు మౌఖికంగా ఆదేశాలు ఉన్న ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు లభించడంలో బ్రేకులు పడ్డాయి.ఆయన అరకొర అనుభవం ఉన్న ఏఎన్ఎం లతో వైద్యసేవలు ఏ విధంగా చేయిస్తారని విమర్శలు కూడా నంద్యాల జిల్లా వ్యాప్తంగా వినబడుతున్నాయి.

**వైద్యం కోసం 10 కిలోమీటర్ల ప్రయాణం చెంచు గిరిజన మహిళలు :**

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ద్వారా చిన్నచిన్న రోగాలకు వైద్య సేవలు అందించేవారు. మా చెంచుగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందజేసి మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం సమ్మె వల్ల చిన్న పిల్లలకు జ్వరం,దగ్గు, వివిధ రోగాలకు దాదాపు పది కిలోమీటర్లు సంత జూటూరు గ్రామానికి వెళ్ళి ఆర్ఎంపీల వద్ద వైద్య సేవలు పొందుతున్నాము. దీనివల్ల ప్రయాణించడం తోపాటు చిన్న రోగాలకు కూడా డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మాట్లాడుతున్న చెంచు మహిళలు

**ఆరోగ్యశాఖ మంత్రి తీరుతో వైద్య సిబ్బంది అసహనం**



సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

: తమ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన సిహెచ్ఓలపై మంత్రి మాట్లాడిన తీరు పట్ల ఆయుష్మను వైద్య సిబ్బంది తీవ్రంగా అసహన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరం కోసం చొరవ తీసుకోవాలే తప్ప సిహెచ్ఓలను తొలగిస్తామని చెప్పడం, ఏఎన్ ఎం లతో వైద్య సేవలు అందజేస్తా మని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు, తాము గ్రామా లలో ప్రజలకు అందుబా టులో ఉంటూ వైద్య సేవ చేస్తున్నామని తెలిపారు. 2019లో కేంద్ర ప్రభుత్వం చెప్పిన విధంగా ఆరు సంవత్సరాలు పూర్తయిన సిహెచ్ఓ లను ప్రభుత్వ ఉద్యోగు లుగా క్రమబద్ధీ కరించేలా, వేతన సవరణతో పాటు ఇన్సెంటివ్ సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ తోనే సమ్మె చేస్తున్నామని నంద్యాల డివిజన్ యూనియన్ నాయకుడు శివకృష్ణ, సౌందర్య గురు ప్రసాద్ లు తెలిపారు.నేటి నుండి సమ్మెను రాష్ట్ర యూనియన్ నాయకుల సూచన మేరకు మరింతంగా ఉధృతం చేస్తామని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

# హిందూ సనాతన ధర్మం చిన్నప్పుడే నేర్పడం అవసరం

**– విహెచ్‌పి రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాష్**

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ ః** పిల్లలకు చిన్నప్పుడే హిందూ సనాతన ధర్మం గురించి నేర్పాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మీడియా కన్వినర్ మాళిగి భానుప్రకాష్ అన్నారు. నగరంలోని షరీన్ నగర్‌లోని శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో గత ఆరురోజులుగా విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం ఆద్వర్యలలో జరుగుతున్న బాలబాలికల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభకు సోమవారం విహెచ్‌పి రాష్ట్ర మీడియా కన్వినర్ మాళిగి భాను ప్రకాష్ హాజరై మాట్లాడుతూ మొక్కై వంగనిది మానై వంగదన్న నానుడిని అనుసరించి చిన్నప్పుడే సనాతన హైందవ ధర్మంలోని సంస్కృతి, సంప్రదాయం, దేశభక్తి, సామాజిక సామరస్యత వంటి సుగుణాలను అలవాటు చేయడానికి చిన్నప్పుడే బీజం పడాలన్నారు. తద్వారా భవిష్యత్తులో పిల్లలంతా పెద్దవారై దేశం కోసం ధర్మం కోసం పనిచేసేలా వారిని సంఘటితం



మాట్లాడుతున్న మాళిగి భాను ప్రకాష్

చేయడానికి ఇటువంటి బాలబాలికల వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. అంతకుముందు పిల్లలు జై శ్రీరామ్..జై శ్రీరామ్..అంటూ శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామా లయం ఇరువైపులా ఉన్న వీధుల గుండా వారే తయారు చేసుకున్న చిన్న పల్లకిలో భగవాన్ రామ్‌లల్లా చిన్న విగ్రహాన్ని ఊరేగించారు. విహెచ్‌పి జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు జ్యోతిప్రజ్వళనతో ప్రారంభమైన బాలబాలికల వేసవి శిక్షణ సభలో మాట్లాడుతూ మాతృశక్తి జిల్లా కన్వినర్ పావని అక్కయ్య గత 17సం॥లుగా ఇక్కడున్న పిల్లలకు ప్రతి ఆదివారం విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం పేరుతో హిందూ దేవీ, దేవతల శ్లోకాలు, నిత్య సాధన శ్లోకాలు, సుభాషితాలు, తెలుగు పద్యాలు, నీతి కథలు, దేశభక్తి గీతాలు వంటివి నేర్పిస్తున్నారన్నారు. గత నెల 29నుండి ఈ నెల 4వరకు ప్రతిరోజు పిల్లలకు శిక్షణ ఇచ్చి వారిచే సోమవారం ప్రదర్శన చేయించడం ఆనంద దాయకమని అన్నారు. విహెచ్‌పి(వెంకటరమణ కాలనీ పరిధి) వెంకటేశ్వర స్వామి ప్రఖండ కార్యదర్శి కరణం సుధాకర్ మాట్లాడుతూ ఇంతమంది పిల్లలు చక్కగా శ్లోకాలు, పాటలు, పద్యాలు పాడుతుంటే తనకు తన చిన్నతనం గుర్తుకొచ్చిందన్నారు. చిన్నప్పుడు నేర్చుకున్నవి ఇప్పటికీ మర్చిపోలేదని నాడు నేర్చుకున్నందుకే తమకు అవన్నీ ఇంకా గుర్తున్నాయని చెప్పారు. అనంతరం పిల్లలందరికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం విహెచ్‌పి మాతృశక్తి కన్వినర్ మాలికి పావని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రవణ్, సహస్ర, బాలబాలికలు పాల్గొన్నారు.

## రైతులను పట్టించుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**– మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి**

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ ః** రైతులను పట్టించుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐటిసి, జిపిఐ పొగాకు గోడౌన్‌లను సందర్శించి అక్కడున్న రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ పొగాకును తమ వద్ద నుంచి క్వింటం రూ.15వేలకు కొనుగోలు చేస్తామని కంపెనీ వారు రైతుల వద్ద అగ్రిమెంట్ చేశారని ఇప్పుడేమో కొనుగోలు చేయడం లేదని నాణ్యత లేదంటూ రూ.7వేలు, రూ.8వేలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయన కంపెనీల అధికారులతో మాట్లాడుతూ పొగాకు పంటను పండించిన రష్టిక, సుఖపరివి, షాప్ బర్లి పొగాకులను పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల దగ్గర నుండి పొగాకు పంటను కచ్చితంగా కొనుగోలు చేయాలన్నారు. పొగాకు పంట రైతులకు శాపంగా మారిందని లక్షల పెట్టుబడులు పెట్టి సాగు చేసినా పొగాకును కొనుగోలు చేసేందుకు అలయన్స్ కంపెనీ అధికారులు నాణ్యత లోపాన్ని చూపుతూ రైతులు అమ్మేందుకు వస్తే నాణ్యత లేదంటూ ధరల కోతలు విధిస్తున్నారన్నారు. రైతులకు అన్యాయం జరుగకుండ వారు పండించిన పంటను మొత్తం కొనుగోలు చేయాలని అందుకు మేము కూడా రైతుల నుంచి సహాయ, సహకారాలు అందేలా చూస్తామని రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేసి పంటను కొనుగోలు చేయకుండ మోసం చేయాలని చూస్తే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపి తిప్పన్న, జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కంపెనీ అధికారులతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాలలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ పేరుకు మాత్రమే జిల్లా ఆసుపత్రి అని సమస్యలకు నెలవని అన్నారు. సిటి స్కాన్ పని చేయడం లేదని ఆ సమస్యను ఎవరు పరిష్కరించడం లేదని అన్నారు. రోజు రోజుకు రోగులు పెరుగుతున్నా ఓపి కేంద్రాలు పెంచడం లేదని అన్నారు. వెంటిలేటర్‌తో కూడిన అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరారు. స్థానిక ంగా మంత్రి ఉన్నా వీటిని పట్టించుకోవడం లేదని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు.

సూర్య www.suryaa.com
మంగళవారం | 06 మే 2025

### ప్రమాదంలో మరణించిన జనసేన క్రియాశీల సభ్యుడికి రూ. 5 లక్షల భీమా సహాయం




**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** జనసేన క్రియాశీల సభ్యత్వంతీసుకున్న దొర్నిపాడు గ్రామానికి చెందినదుర్వేసుల నాగేంద్ర ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ప్రమాద బీమాను జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ. 5 లక్షల రూపాయలు బీమా ఆర్థిక సహాయాన్ని నాగేంద్ర భార్య లక్ష్మీకి రూ.5 లక్షలు అకౌంట్‌కి ట్రాన్స్ఫర్ చేయడం జరిగింది. దుర్వేసుల నాగేంద్ర భార్య లక్ష్మి మరియు కుటుంబ సభ్యులు సోమవారం ఆళ్లగడ్డ జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసి 5 లక్షల రూపాయలు మా కుటుంబ సభ్యులకు అందించినందుకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కి, ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబుకి, ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్యకి, ఆళ్లగడ్డ నియోజకవర్గం ఐ.టి కోఆర్డినేటర్ జంబులదిన్నె మామిళ్ల సుధాకర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాచంశెట్టి వెంకట సుబ్బయ్య, దేవా ఆంజనేయులు, సజ్జల నాగేంద్ర ,ఆవుల జగదీష్, చైతన్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీ ..నలుగురికి తీవ్ర గాయాలు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారి పై హైదరాబాదు నుండి కడప వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్ను ఢీకొని రహదారికి అటువైపు వెళుతున్న మరో కారును ఢీకొన్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాదు నుండి కడపకు ఆరుగురు కుటుంబ సభ్యులు కారులో వెళ్తూ ఉండగా నగళ్ళపాడు సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్ను ఢీకొని అటువైపు రహదారిలో కర్నూలు వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో అచ్యుత రెడ్డి, శ్రీకాంత్, సరిత,వీరేంద్ర, తేజశ్వనిలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని టోల్ ప్లాజాఅంబులెన్స్‌నందు ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్, సరిత,తేజశ్వనిలను మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలమునకు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



### కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

**ఎన్జీవో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి.దస్తగిరి రెడ్డి**


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎంసీఏ సిహెచ్ఓ ఉద్యోగులు సమ్మెలోకి దిగారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ఎన్జీవో సంఘం అసోసియేట్ అధ్యక్షులు దస్తగిరిరెడ్డిని సోమవారం కలిసి వారి సమస్యలను ఆయనకు వివరించి వినతిపత్రం అందజేశారు. గత తొమ్మిది నెలలుగా హెచ్ఆర్ఏ ఇవ్వడం లేదని అలాగే తమ వేతనంలో 10% కలిపి అదనంగా ఇవ్వాలని తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని దస్తగిరి రెడ్డికి వివరించడం జరిగింది. వారి సమస్యలను సి ఎఫ్ డబ్ల్యూ కార్యాలయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అలాగే రాష్ట్ర ఎన్జీవో సంఘానికి తెలియజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షులు నాగార్జున రెడ్డి, సి హెచ్ ఓ ఏపీ ఎంసీఏ ఎగ్జిక్యూటివ్ నెంబర్ అశోక్, సాయి ప్రణీత్, మనీషా, పద్మజ, జ్యోతి, సల్మా, బ్రహ్మ తేజ, విమల తదితరులు పాల్గొన్నారు.

## షేక్.సుహానాకు అభినందనలు తెలిపిన మంత్రి బి.సి


మంత్రి సుహానాను అభినందిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** జాతీయస్థాయిలో టార్గెట్‌బాల్ పోటీలో విశేష ప్రతిభ కనబరిచిన షేక్ సుహానాను మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టును మొదటి స్థానంలో నిలిపిన షేక్ సుహానాను సోమవారంనాడు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తన ఛాంబర్‌లో అభినందించారు. గత నెల 25 నుండి 29 వరకు ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగిన జాతీయస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో షేక్ సుహానా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు మొదటిస్థానంలో విజేతగా నిలవడం వారందరికీ గర్వకారణమని మంత్రి తెలిపారు.

### కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన బి.సి ఇందిరమ్మ


కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న బి.సి ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పేదింటి మహిళల ఉపాధి కోసం ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. 100రోజుల శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమిషన్ కూడా అందిస్తుందని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బి.సి ఇందిరమ్మ తెలిపారు.

# దేశంలో కులగణన రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే

**డోన్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి**


రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్:** దేశంలో కులగణన జరుగుతుందంటే అది కేవలం రాహుల్‌గాంధీ పోరాట ఫలితమేనని డోన్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ గార్లపాటి మద్దులేటిస్వామి, డిసిసి ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్ధన్‌లు అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్.షర్మిళారెడ్డి, ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు లక్ష్మినరసింహయాదవ్ పిలుపులో భాగంగా సోమవారం పట్టణంలోని పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో కులగణన చేస్తాం అనే ప్రకటన రావడానికి కారణం రాహుల్ గాంధీ పోరాట ఫలితమేనన్నారు. కులగణన చేయడం వల్ల ఆర్థిక, సమాజిక, రాజకీయ అసమానతలను తొలగించవచ్చన్నారు. కులగణన ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు పి.జీవన్‌బాబు, డిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డె రాజశేఖర్, డిసిసి కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, డోన్ పట్టణ, మండల అధ్యక్షులు వై.శేఖర్, కమలాపురం పఠాన్‌హుస్సేన్, ప్యాపిలి మండల అధ్యక్షులు జి.నాగన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు గిడ్డయ్య, మీరాసాహెబ్, నాయుడు, ఎస్.మధు, సి.కంబగిరిస్వామి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్త ఉండండి



**పాములపాడు,మేజర్‌న్యూస్ :** ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ,రోడ్డు బద్రతా నియమాలు పాటించాలని ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ అన్నారు. సోమవారం పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్,ఆత్మకూరు రూరల్ సి.ఐ. సురేష్ కుమార్ రెడ్డి , పాములపాడు ఎస్సై సురేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ రామాంజినాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై పంచసూత్రాలు తెలిపారు. హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, మద్యం త్రాగి వాహనము నడపరాదని, సెల్‌ఫోన్‌డ్రైవింగ్ చేయరాదని,ఓవర్ లోడ్ ఆటోలలో ప్రయాణం చేయరాదని, నడుపు వాహనములకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, నడిపే వ్యక్తికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ లోన్స్, ఆప్స్, ఓటిపిల గురించి, ఆన్లైన్ ట్రాన్సక్షన్స్, ఆన్లైన్‌లో ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని, అలాగే తెలిసినవారు ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మవద్దని, స్వయంకృషిని నమ్ముకోవాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలు గురించి, బాల్య వివాహాలు గురించి వివరించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు జరుగుతున్నాయి. కాబట్టి విలువైన ఆభరణములు, వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండవలెనని, ఒంటరిగావెళ్లకూడదని, తెలిపారు. రైతులు పంట పొలాలకు మందులు కొట్టేటప్పుడు తప్పనిసరిగా నోటికి గుడ్డ కట్టుకోవాలని లేదా మాస్క్ వేసుకోవాలని తెలియజేయడం జరిగింది. లేనట్లయితే ఆ మందు పిచికారి చేసేటప్పుడు గాలిపీల్చి అస్వస్థకు గురవుతారని అన్నారు. ఇటీవల కాలంలో కొన్ని కుటుంబ కలహాలతో, అప్పులు అని ఆత్మహత్యలుచేసుకుంటున్నారని,ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని కనుక ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకోకూడదని, మీకు ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఇటీవల కాలంలో సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని, తల్లిదండ్రులు పిల్లలు పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎండాకాలం సెలవులు కావున పిల్లలు ఈతకు కెసి కెనాల్,బావుల వద్దకు వెళుతున్నారని, పిల్లలు ఎక్కడకు వెళుతున్నారు అనేది గమనించాలని, ఎక్కడకు వెళ్లినా తల్లిదండ్రులకు చెప్పాలని పిల్లలకు సూచించారు.

# సింగరాజుపల్లెలో ఈనెల 7 నుంచి ప్రతిష్ఠ వేడుకలు


నూతనంగా నిర్మించిన దేవాలయం

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి సీతారామచంద్ర కామాక్షి సమేత కాశీవిశ్వనాథ స్వామి దేవతా విగ్రహాల ప్రతిష్ట, నాతిశీల, ధ్వజస్థంబాల విగ్రహ ప్రతిష్టా వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 7న స్వామివారికి గణపతిపూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, తదితర విశేష పూజలు ఉంటాయని అన్నారు. సాయంత్రం 6 గంటలకు హోమం, జలాధివాసం, ప్రదోష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8వ తేదీన గణపతిపూజ, మంత్ర జపములు, హోమం, మధ్యాహ్నం 4 గంటలకు స్వామివార్ల ఊరేగింపు, 7 గంటలకు ధాన్యాధివాసం, పుష్పాదివాసం,మహామంగళహారతి పూజలు ఉంటాయని అన్నారు. 9వ తేదీన మూడవ రోజు గణపతి పూజ, విగ్రహాలకు, యంత్రాలకు అభిషేకాలు, ఉదయం 9.45 గంటలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, బలి ప్రధానం, ప్రధాన దేవతా హోమం, పూర్ణాహుతి,ప్రత్యేకపూజలుఉంటాయని అన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సీతారామ స్వామి కళ్యాణం, 7 గంటలకు శ్రీ కామాక్షి సమేత కాశీవిశ్వనాథ స్వామి వారి కళ్యణ మహోత్సవములు ఉంటాయని అన్నారు. అదే రోజు అన్నదాన కార్యక్రమం, పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

# దళిత కాలనీలో త్రాగునీటి ఎద్దడి

**– లబోదిబోమంటున్న దళితకాలనీవాసులు – ఎంపిడిఓకు వినితిపత్రం అందించిన గ్రామస్తులు**


ఎంపిడిఓకు వినిపత్రం అందజేస్తున్న దొడ్డిబెళగల్ గ్రామస్తులు

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని దొడ్డిబెళగల్ గ్రామంలోని దళిత కాలనీలో తాగునీటి సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ఎంపిడిఓ వెంకటేశ్వర్లుకు కాలనీవాసులు బజారప్ప, దేవరాజు, బాలస్వామి, ప్రకాష్, సల్మాన్‌రాజు, ఆనంద్, రాజు, ఈరన్న, గోపాల్, నరేష్ అనేవారు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నీరుసరఫరా చేస్తున్న మెయిన్‌లైన్ పైప్‌లైన్‌కు కొళాయి కనెక్షన్‌లు ఇవ్వడంతో మా కాలనీకి నీళ్ళు రావడంలేదన్నారు. గత వారం రోజులుగా తాగునీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దీనితో గ్రామస్తులు గ్రామం నుండి వచ్చి ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నాచేపట్టి ఎంపిడిఓకు వినిపత్రం అందజేశామన్నారు. దాదాపుగా నెలరోజులుగా నీటి సమస్యతో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. త్వరలో సమస్య పరిష్కరించకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజు, దేవదాసు, మూకప్ప, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన

## ఆర్టీసీ ఉద్యోగులు

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** బనగానపల్లె ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ ఉద్యోగులు సోమవారం నాడు తహశీల్దార్ నారాయణ రెడ్డికి వినతీపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల కొరకు విడతల వారిగా నిరసనలు తెలపడం జరిగింది. అందులో భాగంగా సోమవారంనాడు వారి సమస్యల పరిష్కారం కోరుతూ తహశీల్దార్‌కు వినతీపత్రం అందజేశారు. ఉప కార్యదర్శి శ్రీనివాసులు, ప్రెసిడెంట్ జంబులయ్య, గఫార్, ఎల్లయ్య, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.



# 12వ వేతన సవరణ కమిషన్‌ను తక్షణమే నియమించాలి : ఏపీటీఎఫ్




**నంద్యాల టౌన్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు 12వ వేతన సవరణకు సంబంధించిన కమిషన్‌ను తక్షణమే నియమించాలని అప్పటివరకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎం. మధుసూదన్ రావు, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు కె. సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా సబ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. 11వ పిఆర్సీ గడువు ముగిసి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు 12వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చెయకపోవడం సరైన విధానం కాదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి12పియర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, తక్షణమే30శాతం మధ్యంతరభృతి ప్రకటించాలని వారు రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరారు. పెండింగ్‌లో ఉన్నమూడుడి.ఏలను ప్రకటించాలని, 11వ పిఆర్సీ బకాయిలతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్న అన్ని రకాల ఆర్థిక బకాయిలను ఉపాధ్యాయ, ఉద్యోగులకు తక్షణమే చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మరియు మైనర్ మీడియంలను కొనసాగించాలని, అన్ని రకాల ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు ఒకే విధంగా ఉండాలని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు (సెకండ్ గ్రేడ్ టీచర్లు) ఆన్‌లైన్ విధానంతో కూడిన మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్‌జరపాలని వారు విద్యా శాఖను కోరారు. ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటితే రెండవ సెక్షన్ ను ప్రకటించాలని,ప్రాథమికోన్నత పాఠశాలకు కనీసం నలుగురు సబ్జెక్టు టీచర్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు జి.లింగమయ్య,బి.శ్రీదేవి, మల్లెల. పుల్లయ్య, ఎం.ఎస్. ఉమర్, కె.జనార్దన్ రెడ్డి. ఎమ్. శేషయ్య, ఎన్. రమేష్, బి. సుంకన్న, డి. శ్రీరాములు, మానపాటి రవి, ఎం. పవన్ కుమార్, ఆవుల మునిస్వామి, ఒ.రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలకు 152 మంది ఎంపిక




**ఆళ్లగడ్డ, మెజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అనంత డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 14 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 321 మంది హాజరు కాగా 152 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి పాల్గొని పలు సలహాలు సూచనలు ఇచ్చారు.

## శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రికను మంత్రి ఫరూక్‌కు అందజేస్తున్న ఆర్యవైశ్యులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని నూనెపల్లె శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో మహా కుంభాభిషేక ఘట్టాభిషేక మహోత్సవం ఏప్రిల్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగుతుండడంతో ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలుసుకుని ఆహ్వానపత్రికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కాలువ విజయ్‌శేఖర్, యువజన సం ఘం అధ్యక్షులు మారం నాగరాజు, ప్రముఖ ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బతి వేణు, కార్యదర్శి రజనీకాంత్, మాలెపాటి రఘు, సూరా నాగేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

# పించన్లు పంపిణీ బాధ్యత అప్పగించడం దారుణం

**ఏపి అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చాందినీ**



**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** అంగన్‌వాడివర్కర్లతో అదనంగా క్రిష్ణగిరి మండలంలో పించన్ల పంపిణీ బాధ్యత అప్పగించడం దారుణమని ఏపి అంగన్‌వాడి అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చాందినీ ఆరోపించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చాందినీ, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, సంధ్య, రజనీ, సునీతలు సోమవారం క్రిష్ణగిరి మండల తహశిల్దార్, ఎంపిడిఓలకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కంభాలపాడు పంచాయితీ పరిధిలోగల పెనుమాడ, బాపనదొడ్డి, గుడెంపాడు, కంభాలపాడు గ్రామాలలో అంగన్‌వాడి వర్కర్లతో ప్రతి నెల పించన్లు పంపిణీ చేసే విధంగా అదనపు బాధ్యతలు అప్పగించడం దారుణమన్నారు. పించన్ పంపిణీలో కొందరు అంగన్‌వాడి వర్కర్లు వారి సెల్‌ఫోన్‌తోపాటు కొంత నగదు పోగొట్టుకోవడం జరిగిందని, ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అదేవిధంగా రేషన్ దుకాణాలు, డీలర్ల నుండి అనేక సమస్యలు ఎదుర్కోవాలసి వస్తుందని, అంగన్‌వాడి కేంద్రానికి సరుకులు పంపిణీ చేసే విషయంలో డీలర్ల నుండి సమస్యలు తలెత్తున్నాయన్నారు. కావున అంగన్‌వాడి వర్కర్ల చేత పించన్ల పంపిణీ అదనపు బాధ్యతల నుండి వారిని విముక్తి చేయాలని, లేనిపక్షంలో మండల కేంద్రంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో కలిసి అంగన్‌వాడివర్కర్స్ అసోసియేషన్ ద్వారా ధర్నాలు చేస్తామన్నారు.

## తామే తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ అంటూ అధికారులకు ఆదేశాలు

**– వీరి ఆగడాలతో విసిగెత్తిపోయిన గ్రామస్తులు**

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ల గ్రామంలో ఏ పని జరగాలన్నా వారి అనుమతి తీసుకోవాలని అధికారులు అల్టిమేటెం జారీ చేయడం జరుగుతున్నది. ఇదేం పోకడ అని తీవ్ర అసహనానికి గ్రామస్తులు గురవుతున్నారు. ఈ నాయకుల నడవడికతో టీడీపీకి చెడ్డ పేరు వచ్చేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏ పని జరగాలన్నా ప్రభుత్వ అధికారుల నోటి నుంచి వినిపించే ఒకే ఒక్క మాట వెళ్లి గ్రామంలోని ఓ ఇద్దరు ప్రముఖ నాయకుల నుంచి అనుమతి తెచ్చుకుంటే పని జరుగుతుందని లేకుంటే జరగదని అల్టిమేటెం జారీ చేస్తున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నా రు. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు ఇదేం దుస్థితి అంటూ గ్రామ ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అసలు ఎటువంటి సంబంధం లేని వారు నాయకులం అంటూ చలరేగిపోతూ అధికారులకు అల్టిమేటెం జారీ చేస్తున్నా ప్రభుత్వ అధికారులు మాత్రం వారి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అసలు వీరు ఏ ఎన్నికల్లో గెలిచారో ముందుగా చెప్పాలని అసలు వీరిని నాయకులుగా ఎవరు నియమించారో తమకు తెలియాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రారంభించిన మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి

**– ఇల్లూరు కొత్తపేట, రాళ్లకొత్తూరు గ్రామాల్లో ప్రారంభోత్సవం**



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పరిధిలోని ఇల్లూరు కొత్తపేట, రాళ్లకొ త్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించి న ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకులను సోమవారంనాడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ప్రారం భించారు. వారు ఆయా గ్రామాలకు చేరుకోగానే గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వారికి ఘనస్వాగతం పలికారు. ప్రారంభోత్సవ అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగు నీటి సౌకర్యం కల్పించేందుకు కులాయి కనెక్షన్ అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పథకం ద్వార 35.60లక్షల నిధులతో కొత్తపేట గ్రామంలో 31.50లక్షల నిధులతో రాళ్లకొత్తూరు గ్రామంలో త్రాగునీటి పథకం చేపట్టినట్లు తెలిపారు. ఇల్లూరు కొత్తపేట గ్రామంలోని ప్రజల త్రాగునీటి సమస్యలు తీర్చేందుకు దాదాపు 60వేల లీటర్ల ఓవర్ హెడ్ స్టోరేజి ట్యాంకును నిర్మించడం జరిగిందని అలాగే గ్రామంలో 7.5హెచ్.పి సామర్థ్యంతో బోరు వేసి పైపులైన్ ద్వార గ్రామంలో ప్రతి ఇంటికి అందించనున్నామన్నారు. మంత్రి బి.సికి అభినందనలు తెల్పుతూ పలువురు పెన్నులు, పుస్తకాలు అందజేశారు.

# ఇద్దరే..ఇద్దరూ..?

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామంలో స్థానిక గ్రామ సచివాలయంలో నెంబరు - 1కార్యాలయంలో ఎనిమిది మంది సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ కార్యాలయంలో సోమవారం రోజున కేవలం ఇద్దరు అంటే ఇద్దరూ మాత్రం తమ విధులను నిర్వహించడం జరిగింది. అందులో గ్రామాపంచాయతీ కార్యదర్శి లక్ష్మి.సచివాలయం నెంబరు - 2లో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ మాత్రం ఉండటం జరిగింది. మిగిలిన ఇతర సిబ్బంది లేక పోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయంను చూసి ఇక్కడ ఏ అధికారి లేరంటూ వెనుతిరుగు పోతున్నారు. మరికొంత మంది సచీవాలయ కార్యాలయానికి వచ్చి ఇదేమి కార్యాలయం అంటూ శాపనార్థాలు పెట్టి వెళ్లి పోతున్నారు. అలాగే పలు గ్రామాలలో సచీవాలయ ఉద్యోగులు సకాలంలో తమవిధులకు సక్రమంగా హాజరు కావడం లేదని అయాగ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.


సచీవాలయం- 1లో ఇద్దరే ఇద్దరూ ఉద్యోగులు హాజరు

## గురుస్వామి గడ్డం నాగరాజుకు నివాళులర్పించిన నాయకులు

**ఆలూరు, మేజర్ న్యూస్ :** ఆలూరు పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు గురుస్వామి గడ్డం నాగరాజు ఆదివారం గుండెపోటుతో మరణించడంతో ఎమ్మెల్యే విరుపాక్షి, టీడీపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్,వైసిపి నాయకులు భాస్కర్ నాయుడు, మల్లికార్జున తదితరులు నాగరాజు మృతదేహానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడ్డం నాగరాజు పట్టణంలో మంచి పేరున్న నాయకుడు అని అలాగే అయ్యప్ప స్వాములకు గురు స్వామిగా అందరి మన్ననలు పొందరన్నారు.


నాగరాజు కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

# గ్రామాల్లో స్మార్ట్ టాయిలెట్స్ నిర్మాణం పూర్తి



మహిళలకు శానిటరీ న్యాపికిన్స్ అందజేస్తున్న రామ్‌కో యాజమాన్యం

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** చింతలాయపల్లె, నాయునిపల్లె గ్రామాల్లో స్మార్ట్ టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేసినట్లు రామ్‌కో సిమెంట్ యాజమాన్యం వారు తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో 25 చొప్పున 50 టాయిలెట్స్ రామ్‌కో సిమెంట్ వారు నిర్మించారు. ఒక్కొ టాయిలెట్‌కు 50 చొప్పున 25లక్షలు ఖర్చు చేసింది దీనికి అదనంగా మహిళలకు శానిటరీ న్యాపికిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.ఒ భరత్ రెడ్డి, సి.ఎస్.ఆర్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరా నిలిపివేత

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** బనగానపల్లె భానుముక్కల ఏరియాలో మంగళవారం నాడు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. కొండాపేట బ్రిడ్జి దగ్గర ఉన్నటువంటి సంపు శుభ్రపరచడానికి ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నాయక్‌వాడి మసీదు ఏరియా, శివాలయం ఏరియా, సుంకులమ్మ గుడి, నాలుగు స్థంబాల మసీదు, పెద్దపీర్ల చావిడి, కొండాపేట హరిజనవాడ, అమ్మవారిశాల, పింజరిపేట, చాకలిపేట తదితర ఏరియాల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

## బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు నోటీసు బోర్డుపై తొలగించరా?




**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల కేంద్రంలోని స్థానిక తాహాశీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు హోదాను బట్టి నోటీసు బోర్డులో తమ తమ పేర్లను ప్రక్కన హోదాతోపాటు సెల్ ఫోన్ నెంబర్లను కూడా వ్రాయడం జరుగుతుంది. అయితే ఇదేకార్యాలయంలోపని చేసిన డిప్యూటీ తాహాశీల్దారు.భూరీసర్వే అధికారి అయిన జె. మహేష్. అలాగే మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా పని చేసిన జే. మహేష్ కూడా ఇక్కడ నుంచి బదిలీ పై వెళ్లి వారి స్థానంలో కొత్తగా అధికారులు జాయినిగ్ అవ్వడం జరిగింది.బదిలీ పైవెళ్లిన అధికారులుఐదారు నెలలు గడుస్తున్నా నేటికీ నోటీసు బోర్డుపై యధా విధిగా కనిపించడంతో మండలంలోని వివిధ గ్రామాలనుండితాహాశీల్దారు కార్యాలయానికివచ్చిన జనం ఆవాక్కు అయిపోతున్నారు.నోటీసుబోర్డుపై కేవలం మండల తాహాశీ ల్దారు. ఎఎస్ఓ. కంప్యూటర్ ఆపరేటర్లు. పేర్లు తప్పా ఇంకెవరు అధికారులు పేర్లు బోర్డు పై కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా మండల తాహాశీల్దారు జోక్యం కల్పించుకొని నోటీసు బోర్డుపై బదిలీ పై వెళ్లిన అధికారులపేర్లు తొలగించి వారి స్థానంలో ప్రస్తుతం కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్. భూరీసర్వే. అధికారి పేరు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పేరునునోటీసు బోర్డుపై రాయాల్సిందిగామండలప్రజలు కోరుతున్నారు.

# దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించండి

## – జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయనా ఆడిటోరియం నందు పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రీఓపెన్ అయిన అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గడువులోపు అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కి సంబంధించి వచ్చిన అర్జీలు సక్రమంగా పరిష్కారం అయ్యాయా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్‌కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 26, కర్నూలు ఆర్డీఓ వద్ద 25, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, సర్వే ఏడి వద్ద 2, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మత్స్య శాఖ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఒక అర్జీ చొప్పున పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవ్య, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



డి నోటిఫై పత్రాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

# 11 మంది రైతులకు డి నోటిఫై పత్రాల పంపిణీ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** చుక్కల భూములు, 22ఏ1 భూములు నిషేధిత జాబితాలో ఉండి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 11మంది రైతులకు డినోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలను అందజేశామని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత డి నోటిఫై పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి నిషేధిత జాబితా నుంచి 11మంది రైతులకు 32.71 ఎకరాల విస్తీర్ణం గల డి నోటిఫై పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భూ నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 11 ఎ1 భూములు గత ఐదారు సంవత్సరాల నుంచి వివిధ సమస్యలతో పెండింగ్‌లో ఉండి పరిష్కారం కాని సమ స్యలను రికార్డులను పరిశీలించి పరిష్కారం చూపామన్నారు. దీర్ఘకాలిక భూ సమస్య బాధితులైన 11మందికి కలెక్టర్ డి నోటిఫై పత్రాలను అందజేశారు. అనంతరం రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రభుత్వ ప్రాధాన్యతపై కార్యాచరణ నివేదికలు ఇవ్వండి :** పి4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాలను ఆదుకొనేందుకు మార్గదర్శికులను అన్వేషించి మండలాల వారీగా జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. పేదరిక నిర్మూలనకు పి4 సర్వే ద్వారా మండలాల వారిగా గుర్తించిన 43,021బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని చేయూతనిచ్చేందుకు మార్గదర్శికులను గుర్తించాలన్నారు. ఇప్పటి వరకు 458మంది మార్గదర్శకులను మాత్రమే గుర్తించారని మండలాల వారిగా సంపన్న కుటుంబాల మార్గదర్శకులను గుర్తించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 26,139మంది ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారని ఇప్పటి వరకు 12,651 ఇళ్లకు మాత్రమే పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశామని మండలాల వారీగా సంబంధిత లబ్ధిదారుల డేటాను తీసుకుని పొసెషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

# పట్టువదలని విక్రమార్కుడు మా బి.వి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చేనేత నాయకుడు బుడిగె నాగరాజు

- చేనేత రంగ అభివృద్ధిలో కృషివలుడు
- టెక్స్‌టైల్ పార్క్ సాధనలో ఆధ్యుడు
- రానున్న రోజుల్లో చేనేతలు బి.వి రుణం తీర్చుకుంటాం
- టీడీపీ చేనేత నాయకుడు బుగిడె నాగరాజు

**ఎమ్మిగనూరు మేజర్‌న్యూస్ ప్రతినిధి :** అభివృద్ధి అనే పదం వినాలంటే ఎమ్మిగనూరు ప్రాంతా వాసులకు బి.వి కుటుంబం చిరకాలం గుర్తుంటుంది. గ్రామీణ రోడ్లు మొదలుకొని మౌలిక వసతులు అందించి తాగునీటి కష్టాలు తీర్చి, సాగునీటి కోసం ప్రాజెక్టులు తీసుకొచ్చి అన్ని రంగాల అభివృద్ధిని కాంక్షిస్తూ.. నాడు తండ్రి బి.వి మోహన్ రెడ్డి చూపిన బాటలోనే తనయుడు ఎమ్మెల్యేగా బి.వి జయనాగేశ్వర రెడ్డి చేనేత పురిలో నివాసం వున్న చేనేతల కోసం మా కష్టాలు తీర్చడంలో సంకల్పంతో చేతి మగ్గాల నుండి చేనేతల కష్టాలను కడతేర్చాలన్న లక్ష్యంతో ఎమ్మిగనూరు ఖ్యాతిని విశ్వం నలుదిక్కులు వ్యాపించేలా మంచి ఆలోచనలతో 77 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయబోతున్న మా శాసన సభ్యులు బి.వి జయనాగేశ్వర రెడ్డి రుణం ఎల్లకాలం తీర్చుకునేందుకు ముందుంటామని టీడీపీ చేనేత నాయకుడు బుగిడె నాగరాజు అంటూన్నారు. ఆయన మాటల్లో.. 1983 నుండి 2004 వరకు 5 సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో మున్సిపల్, రవాణా, రోడ్లు, భవనాల శాఖల్లో మంత్రిగా బి.వి మోహన్‌రెడ్డి పని చేసి ఎమ్మిగనూరు ప్రజల స్నేహశీలిగా రాజకీయ రంగంలో కొత్త ఒరువడులు అందించిన మహనీ యుడు అడుగు జాడల్లో ఒక్కడై నిలబడి రెండుసార్లు శాసన సభ్యుడిగా ఎన్నికైన బి.వి జయనాగేశ్వర రెడ్డి నాన్న చూపిన బాటే తన రాచబాటలుగా వేసుకొని ప్రతి అడుగు అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్లతో ముందుకు పోతూ.. చతికిలపడ్డా చేనేత రంగానికి ఊపిరిపోస్తూ భావితరాల్లో యువతకు నేను ఉన్నారని చాటి చెప్పు కుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణారికి నాంది పలికి ఉపాధి కల్పనకు దారులు వేసిన బి.వికి యువత, చేనేత రంగం ఏమి ఇచ్చి రుణం తీర్చుకోవాలో అర్థం కావడం లేదని కొనియాడారు. నేడు చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా జాతీయ రహదారి



ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డితో చేనేత నాయకుడు బుడిగె నాగరాజు

167కు అనుకొని 77 ఎకరాల్లో బనవాసి అటవీ ప్రాంతంలో ఎమ్మిగనూరు పట్టణానికి కూతవేట దూరంలో చేనేత రంగ అభివృద్ధికి పరిశ్రమను తీసుకొచ్చిన ఘనత బి.వి కుటుంబానికే దక్కిందన్నారు. చేనేతలపై బి.వి కుటుంబానికి వున్న మక్కువ ఏ పాటిదో అర్థం అవుతుంది. 2018 ఏడాదిలోనే టెక్స్‌టైల్ పార్క్‌ను సాధించిన ఘనత బివిజేకు ఉండగా 2019లో ఏర్పడిన వైకాపా ప్రభుత్వం చేనేతలను విస్మరించి టెక్స్‌టైల్స్ పార్క్‌కు కేటాయించిన స్థలాన్ని ప్లాట్లు వేసి అమ్ముకున్న దుస్థితి కల్పించిందన్నారు. 2024లో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం రాగానే చేనేతలకు ఇచ్చిన హామీని నేరవేర్చుకున్న ఘనతను బి.వి చాటుకున్నార న్నారు. ఎమ్మిగనూరు ప్రాంతా భివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ.. 42 ఏళ్లుగా బి.వి కుటుంబం చూపిన ఆదరణ మరవలేనిదన్నారు. అలాంటి నాయకుడి నాయకత్వంలో చేనేత బిడ్డగా నా పయనం సాగుతుందంటే ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు.

# విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తాం – ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

## – ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 93 ఫిర్యాదులు



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. సోమవారం బొమ్మలసత్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పూర్తి విచారణ జరిపి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఫిర్యాదులు మరలా పునరావృత్తం కాకుండా చూడాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. నిర్ణీత గడువులోపు ఫిర్యాదులు పరిష్కరించాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు.

# కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** గత 8 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి గ్రామీణ ప్రాంతాలలోని ఉప కేంద్రాల్లో బిఎస్సీ నర్సింగ్ పట్టభద్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత లేదని వారు అన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆఫీసర్ల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని అధికారులకు ఫోన్ ద్వారా వివరించడం జరిగిందన్నారు. తాను సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు

## – జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించినఫిర్యాదులన్నింటిపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 111 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి త్వరితగతిన సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. భాదితుల ఫిర్యాదులలో కొన్ని చెత్తబండి ఇప్పిస్తానని చెప్పి రూ.3లక్షల30వేలు తీసుకుని ధనుంజయ్, జానకిరాముడులు మోసం చేశారని క్రిష్ణగిరి మండలం అలంకొండ గ్రామానికి చెందిన బంగారి ఫిర్యాదు చేశారు. రూ.2లక్షలు విలువ చేసే కందిపంటను నాశనం చేసి మా కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన మాల మాధమ్మ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సిఐలు శ్రీనివాసనాయక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ